# 'దొడ్డమ్మ'

పసుమర్తి కృష్ణమూర్తి గారు

అప్పుడే అరుణోదయం కావొచ్చింది. నా సంధ్యావందనంకూడా ఐపోవచ్చింది. అంతలో యెవరో మెట్లుదిగి చెరువులో కొస్తూవున్నట్లు అడుగుల చప్పుడైంది. అట్టే తిరిగిచూతును గదా యెప్పుడో పోయిన మా దొడ్డమ్మ జ్ఞాపకానికొచ్చింది. నిశ్చయంగా యీ వొచ్చిన వ్యక్తి ఆ గంగాభాగీరథీ సమానురాలే యనుకోవచ్చు. అట్టే వెలుతురులేదు; అందువల్ల నంతకంటే యెక్కువ చెప్పలేను. అంతలో నేనున్నా 'శ్రీకృష్ణబ్రహ్మార్పణమ' స్తని లేచి దోవతులు బుజానవేసుకొని జారీచెంబు పట్టుకుని నాలుగు మెట్లెక్కేసరికల్లా ఆవిడే దగ్గిరగావొచ్చి "యేఁవిరా. నాయనా అవధాన్లూ, బాగున్నావ్రా నువ్వూ నీపిల్లలూనూ?" అని చాలా ప్రేమతో అడిగింది పాపం. ఆ గొంతుకా ఆ ధాటీ ఆ సూటీ చూస్తే యే మొగాడు పనికొస్తాడు? నేను మెల్లిగా వొదిగి "అమ్మా బాగున్నాను తల్లీ నీ దయవలన" అన్నాను. ఆవిడే తనచంకలో నున్నమూట గుభాలున కింద పడేసి "కూచోరా; వెలుగువుగాని—అప్పుడే తెల్లారిందో లేదో యింకా—వొచ్చి చెరువులో పడ్డావు పాపం" అంటూ కూచుంది.

"అమ్మా యిప్పటికే చాలా......"

"చాలుచాలూరుకో! అందుకే నీలాంటి నిర్భాగ్యుల్ని చూస్తే నా కసహ్యం!!" అంటూ మూట విప్పింది. అన్నిటికంటే నాకంటి కందులోవున్న గజ్జెలెక్కువాశ్చర్యం పుట్టించాయి. "యెందుకమ్మా అవి?" అని అడిగితే యేం తప్పో! అంతంత గజ్జలు చూచి అడగకుండా వుండలేనాయె! "బుద్ధి జాడ్యజనితోన్మాదు"లని అన్నాడా అంటాడా మరి: చూదాం వనుకుని "అమ్మా ఆ యినపగజ్జెలెందుకు?" అన్నాను.

"యినపగజ్జెలా—యెందుకూ అంటావా?" అంటూ సావకాశంగా సంచీలోంచి అద్దాకొకటి తీసి పైనుంచి అందులో యిన్ని అటుకులు పెట్టుకుని ఆ సంచీ మూటకట్టి అటుకులు తింటూ "అబ్బాయీ, చెప్తా వినూ—దానికేంగాని నువ్వూ యిన్నటుకులు తిను: రా: చెయ్యిపట్టు"మన్నాది. శ్రీరామ రామా!! నా కర్మం కాలిపోతే!! "అమ్మా, కోపం పడకుమా!! పెద్దదానవు నువ్వు పళ్ళైనా తోంవుఁకున్నావో లేదో-స్నానం మాటటుండనీ-అప్పుడే తిండి గోసా?!!" అన్నాను. దానితో వొక్క వుఁకుం వురిఁవింది!! "నీ పిండం పిచికలకి పెట్టడం!! యెప్పటివో యిక్ష్వాకుల బారసాలనాటి పుస్తకాలు పట్టుకుని యేడుస్తూ!! స్నానాలూ ధ్యానాలూనూ!!—మీ కరణం పంతులుగార్ని చూచి బుద్ధి తెచ్చుకోరాదూ!!" అని గర్జించింది మళ్లా! దానితో భయంవేసింది నాకు "అమ్మా, నేరః గడ్డితిని యేదో అన్నాను క్షమించు" మని పాదాలమీద పడ్డా నాపాళంగా. దానితో చల్లారింది పాపం. "వెర్రిముండాకొడకా—లేలే—నీ మీద నాకెందుకు కోపం." అంది చల్లగాను. బ్రతుకు జీవుడా అనుకున్నానంతతో. ఆ తరవాత మెల్లిగా అన్నాను "అమ్మా యీపూట మా నట్టింట విస్తరివేసుకు పట్టెడన్నం నాతోపాటుతింటే నేను సంతోషిస్తా"నని. 'కడి గండం కాస్తుం' దన్నారు గదూ పెద్దలు! అందుచేత. నవ్వింది: "వొస్తాలే మరెప్పుడైనా—వోపూటకాదు: శాశ్వతంగా వుంటాను; మరికొన్నాళ్లు పోనీ" అంది. "ఐతే మరెక్కడికెళతా వీపూట?" కన్నాను తరవాత. "కరణం పంతులున్నాడు గదూ!—వాడు నాకతి దగ్గిర చుట్టం—నీతో చెప్పకేంగాని నువ్వూ నీ పెళ్లాం బ్రతికుండగా మీయింటికి రాను! నీ పెళ్ళాం తిడుతుంది నన్ను. దాని ఆచారాలకీ నా ఆచారాలకీ యెతీఅంటే ప్రతీఅంటూ వుంటుంది." అన్నాదామె చీదరించుకుంటూ. నా కీమాటమాత్రం చాలా కష్టంగా వినిపించింది. యేఁవంటే నా పెళ్లాంవని చెప్పుకోడం కాదు. "పెగలను దనవారి వేరుగాఁ

జూడక సమతనారయునట్టి సదయహృదయ: కాని మాటలు దన్నుఁ గలుషాత్ములాడినఁ గలహింపనొల్లని గరితమిన్న" అని యేదేదో ఆ పురాణాల్లో ఆడవాళ్లని గురించి చదుతాంవేఁ అదుగో ఆలాటి మనిషి! ఆ పసుపూ ఆ కుంకంబొట్టూ ఆ కాటుకకళ్ళూ ఆ చిరునవ్వూ—"యేంవండీ' యని యెదురుగుండా వొస్తూవుంటే ఆ సొగసునకు ఆ సోయగమునకు ఆ పవిత్రతకు నాలో నేను వుప్పొంగిపోతూవుంటానే!! మూర్తీభవించిన సాత్వికత !! అట్టిదాని యాచార వ్యవహారలకా యీ చచ్చుముండాకూతురు వ్యాఖ్యానాలు చేయడం అనుకున్నాను. కానీ ఐనా ఆడది! తప్పు దానిదేఐనా మనం వేఁవీఁ అనకూడదు గదా! అందుచేత నిదానించి "అయితే కరణం పంతులుగారి యింటికే వెళతావా అమ్మా?" అన్నాను. "ఆహా! మువ్మాటికీ! ఆ యిల్లాల్ని చూస్తే నా కన్నుఁకూడా ఆక్కర్లేదు. హాయిగా యేమూ యేదున్నరా అయ్యో సరికల్లా యింకా పక్కమీదనుంచి లేవకముందే కాఫీ వుప్మా దోసె..." అని యింకా ఆమె యేదో సోదె పోసేస్తూవుందిగాని నాకు పనిలేదూ! పాఠాలుచెప్పుకునే కుర్రాళ్ళు గోలయెత్తుతూ వుంటారు అందుచేత "అమ్మా, సెలవిప్పించు: వెళతా"నన్నాను వినయంతో. "వెళతావట్రా నాయనా? సరే వెళ్ళు—ఐతే నాగజ్జలమాటా అడిగి వూరుకున్నావే" అంది.

సరే. ఏందా ఆలస్యం మరౌతుందా అనుకున్నాను ఆ గుండుగమ్మ లనుమానం తీరాలి. లేకుంటే నిద్ర పట్టదు; అందుచేత చెప్పమన్నా. అక్కడినించీ ఆరంభించిం దా అపరూపవ్యక్తి.

"ఒరే పశ్చిమబుద్ధీ, యింతమాత్రం పోల్చుకోలేకపోయావుకదా!! గజ్జలు కాళ్లకు కట్టుకుని నృత్యం చేస్తాను. విన్నావా?...యేం వలాగ చచ్చుమొగం పెట్టి చూస్తావేఁ?...విను—ఆలీ మగఁడూ, అత్తాకోడలూ, అన్నాతమ్ముడూ మొదలైనవాళ్లు తగువులాడుకుంటూవుంటే నాకూః ఆనందం! తకదధిగిణతైయ్యాని వొక్కటే ముక్తాయింపు. ఐతే నా కిప్పుడు ఆనందంకాదు పరమానందంకాదు కేవలం బ్రహ్మానందావస్థ ప్రాప్తిస్తూవుంది. అందుకనే అటుకులు తిని బ్రతికివున్నాను. లేకుంటే చచ్చిపోయేవుండును."

"అమ్మా, నీవు చెప్పేది బాగా అర్థంకాలేదు.."

"అర్థంకాలేదూ?! నీ శ్రార్థం—నీ వేదాలు కాల్చా! నీ నెదడుపేల్చా! లౌక్యంవంటే ఆవగింజలో అరవీసంవైనా లేదు!!"

"అమ్మా మా తాతలనాట్నుఁచీ లేనిది నా కేలాగొస్తుంది?"

"ఏలాగొస్తుందా!! నీ కోడలు రానీరా తెలుస్తుంది! నీ నీరు కావిదోవతుల నీటూ నీ పెళ్లాం వాళాడపుగోటూ నిప్పుల్లోవేసి కాల్పించేస్తాను దాన్తో చెప్పి!! అప్పుడు తెలుస్తుంది! పెళుదుగాని పెండేకట్లు—తెగబారదేసి!!"

"అమ్మా, మా దొడ్డమ్మ వనుకున్నందుకు బాగానే తిన్నాను, నీచేత! మా అమ్మైనా నన్నెప్పుడూ వొక్కమాట అని యెరగదు."

"యెందు కంటుందీ పాపం—మొగుడి గుండెల మీదెక్కి చిందులుతొక్కి చిత్రాంగి—యెందు కంటుందిరా?"

"అమ్మా, యీ ఖజ్జాకోరుమాట లెందుకూ? ఆడదానవుకాదా యెంతైనా..."

"ఓరి తాటాకులకట్టా, నోరుకట్టు—ఆడదానైతే నాకు మాటాడ్డానికి స్వతంత్రం లేదనుకున్నావా?"

"స్వతంత్రం లేదనలేదు తల్లీ స్వతంత్రం లేదనలేదు: కాని నోటికొచ్చినట్టూనా..."

"ఔను నోటికొచ్చినట్టూ మాటాడవలసిందే. యిష్టంవొచ్చినట్టూ తిరగవలసిందే! నువ్వెవడవు మధ్య!!"

అయ్యయ్యో నేనెవడ్నీ ఔతానని చెప్పలేదు. లోకరీతి యీలాటిదీ అన్నానుగాని మరేంవీఁకాదు"

"నీ లోకరీతులు నీ మీదవేసీమని చెప్తాలే నీ కొడుకుతో!! లాహిరీకి చదూతున్నాడేమో చెన్నా పట్నంలో ?"

"యేలాగో అంతభాగ్యం నాకు పట్టాలిగదూ—నీధర్మంవాఁ అని-ఆవొక్కడి చేతిమీదా..."

"భయం లేదులే నే నాశీర్వాదం చేస్తా-చచ్చే దాకా యెందుకూ? బతికివుండఁగానే నిన్నూ నీ పుస్తకాల్నీకూడా సంస్కరించుమఁటూ !"

"నీదయ తల్లీ నీదయ !!"

"పోనీగాని నీకేదైనా యెంకిపాటొస్తే పాడుదూ—నే నాడతానూ-నీతో మాట్లాడినకొద్దీ నా మనస్సు పాలసముద్రంలాగ..."

"అమ్మా నాకు పాటలురావు. యేవో భజగోవింద శ్లోకాలుమాత్రం..."

"నీ భజగోవిందం పాడైపోనూ !!...వుండు నేను పాడతా విను-గజ్జలు కట్టుకోనీ" అంటూ మూట విప్పి గజ్జలుతీసి కట్టుకుని (పాట)

"నీకు నాకూ దూరమాయే-నీళ్లరఘూకీ యడ్డమాయే। పోకురా నను బాసి యప్పుడే-వొకఁ-బుద్ధిలేని బోడిబాపడ ॥పో॥ నీవుచూస్తే నువ్వులబోడీ-నేనుచూస్తే పువ్వులబోడీ। లేవరా యీబోడికాబోడి సలాం-నను-లీలలదేల్చర ॥లేవరా॥ దధిగిణ దధిగిణ దధిగిణ ॥నీకు॥

అఁటూ వొక్కగెంతువేసింది నా మీదికి. పరధ్యానంగా నిలబడ్డానేమో-పడ్డాను గుభాలున. లేచి మళ్ళీ యిట్టే చూచేసరికి యెవరూలేరూ!! యిదేదో పెద్ద దేవతామహిమలాగ తోచింది. యెవరీమే అని ఆలోచించా. ఆపాళంగానే యింటికొచ్చా. నేను వెళ్ళగానే యెప్పుడూ నవ్వుతూ యెదురుగా వొచ్చి నా భుజానున్న తడిగుడ్డలు ఛప్పునందుకుని వెటనే పొడిదోవతులు తెచ్చియిస్తూవుండే మా ఆవిడె అరోజు నన్నుచూచి దూరంగా నిలబడిపోయింది. దాని మూపుల్లో యేదో సందేహం వున్నట్టు స్పష్టంగా తెలుస్తూనేవుంది. "యేంవిటి చూస్తున్నా" వన్నాను. "యేంవీఁలే"దని గిరుననతిరిగి లోపలికిపోయింది. నాకు కొండంతకోపం వొచ్చిందిగాని మళ్లీ అణుచుకున్నాను; ఆపాళంగా పెరటి వసారాలోకిపోయి దోవతు లారేసునుని పొడిదోవతి కట్టుకుని దేవతార్చన చేదాంవని కూర్చున్నా. కాని మనసులోమాత్రం అదేస్వరూపం; చెవుల్లో యింకా అదేపాట; శివశివా పాపము శమించుగాక యనుకొని మళ్ళా పెరట్లో నూతిదగ్గరనే స్నానంచేసి ఆ తడిబట్టతోనే సహస్రగాయత్రీ జపం చేసుకున్నా-అప్పుడు మనస్సు కుదుటపడ్డాది. "వంట కావొచ్చింది-దేవతార్చన కానీండి"అంటూ మళ్ళా ఆవిడె నవ్వుతూ లోపల్నుంచివచ్చి చెప్పింది. భోజనా లయాక యీ కథంతా చెప్తే "ఆమె యెవరనుకున్నారు? మీ దొడ్డమ్మగారు కాదు; జ్యేష్టాదేవి !! నా తనువుండగా యీ గడప తొక్కనివ్వ"నని వెంటనే మహాలక్ష్మిపూజా కుంకం బొట్టెట్టుకుని సుందరకాండ వొకసారి చదివి కర్పూరనీరాజనం సమర్పించింది మహాలక్ష్మికి.